దీపకరాగం

శ్రీ కె. వి. యస్. అచ్యుతవల్లి

"సీతా!" అన్న పిలుపుతో వెనక్కి తిరిగిచూసింది. తెల్లగా పొడుగ్గా దృఢంగా వున్న యువకుడు నవ్వుతూ ముఖంలోకి చూశాడు. ఒక లిప్తలో సీత నిర్ఘాంతపోయింది. విశాలమైన నుదురుమీద పడుతున్న వుంగరాల జుట్టూ, "టెరిలిన్ బుష్‌షర్టు," "గాబర్డీన్ పాంటు," "హవాయ్ చెప్పులూ" "ఐలాష్ వేసుకున్నట్టున్న నల్లని కళ్ళూ" అతని "అరిస్టోక్రసీ"ని చాటుతున్నయ్. సీత బెదిరిపోయింది. ఎవరితను? తన పేరుపెట్టి పిలుస్తున్నాడు? పేరు ఎలా తెలిసింది? కంగారుపడుతూ రెండడుగులు వెనక్కి వేసింది! అతను వుత్త మొండిమనిషిలా బిహేవ్ చేస్తూ.

"కంగారుపడుతున్నావని తెలుసు సీతా. అయినా ఇన్నాళ్ళకు దొరికిన జీవిత పెన్నిధిని పోగొట్టుకోలేను." అంటూ దగ్గరగా వచ్చి రెండు చేతులూ పట్టుకుని లాగుతూ ఇసకలో చతికిలబడ్డాడు. సీత చేసేదిలేక కూలబడింది. ఆమె మనస్సు అనంతమైన వేదనతో నిండింది. ఇవ్వాళ శనివారం. తప్పకుండా ప్రొద్దుట దుర్ముహూర్తంలో లేచివుంటుంది. హాఫ్ డే కదా! అని సాయంత్రం ఉప్పుడుపిండి చేసుకుని మూత పెట్టుని కాఫీగిన్నె బొగ్గులార్పేసిన కుంపటిమీద వుంచి కాస్సేపు కులాసాగా వుంటుంది కదా అని బీచివైపు వచ్చింది. వీ డెవడో! ఖర్మాన లేచిన వేళావిశేషం కాకపోతే ఇలాంటివాళ్ళకి తనే తటస్థపడాలా? ఇతను చూస్తే గొప్పవాడల్లే కనపడుతున్నాడు. తనలో ఏ అందంచూసి వెంటపడుతున్నాడు? నాన్న వచ్చేటప్పుడు అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి సీతకి!

"పట్నంలో జాగ్రత్తమ్మా సీతా! ఎవ్వరితోనూ అట్టే స్నేహాలు చేయకు. కొల్లీగ్సుతో కూడా అధికంగా మాట్లాడకు! బాస్‌తో అవసరానికి మించి మాట్లాడితే తెల్లవారేసరికి మీ పేర్లు గోడలమీద వుంటాయి. ఎల్లా నెగ్గుకొస్తావో! ఏంచేయను? నా పరిస్థితులవల్ల నీచేత వుద్యోగం చేయిస్తూ వూరుకాని వూరుకి పంపాల్సొస్తోంది. ఒక అయ్యచేతిలో పెట్టలేకపోతున్నాను. ఈ ముసలితండ్రినుంచి నీవు కష్టాలు పడుతున్నావు. సీతా! మన పరిస్థితులు నీకు తెలుసు. నామీద కోపం వుంచుకోకు తల్లీ!" సీతకళ్లు తడి అయ్యాయ్. సముద్రపుగాలికి ముఖంమీదకి పడుతున్న ముంగురులను రెండు అరచేతులతోనూ పైకి త్రోసుకుంటూ ధైర్యంచేసి తనకే తెలీని భావంకోసం అతని వెంపుచూసింది. నీళ్లతో నిండిన ఆమె కళ్లు అప్పుడే వుదయిస్తూన్న చంద్రుని కిరణాలలో తళతళా మెరుస్తుండగా దిగ్భ్రాంతితో చూస్తున్న ఆ యువకుడు....

"ఎంత మారిపోయావు సీతా ? కళ్ళల్లో ఇన్ని అందాలు సంతరించుకోగలవని నేను వూహించుకోలేకపోయాను. నీ మెత్తటి జుట్టునీ, నీ కుడిచెంపమీది పుట్టుమచ్చనీ, నేనాలోచించని ఘడియ లేదంటే నువ్వు నమ్మతావా ? నే ననుకున్న దానికంటె మిన్నగా తయారయ్యావు. అందులో సగంచాలు, నా బ్రదుకు తీయని పాటగా సాగిపోవటానికి." ఏదో కవిత్వం మొదలెట్టాడు. సీతకు పూర్తిగా మతిపోయింది. ఈ రోజుల్లో గొప్పింటి మగపిల్లలు "డోసు"లు తగిలించి ఆడపిల్లల వెంటబడటం ఆమెకు తెలుసును. అదే ప్రజ్ఞగా భావిస్తున్న ధనికయువకులు అంటే ఆమెకు చిరాకు. ఇతనుకూడా ఆబాపతు మనిషేమో అనుకున్నది. ఇతను వూహాగానంలో వుండగానే తప్పించుకపోదామన గమ్మున లేవబోయింది. ఆ యువకుడు కనిపెట్టాడు:

"సీతా ? నేను వెర్రివాణ్నను కుంటున్నావా ? చిరకాలంనించీ నా మనస్సులో ముద్రవేసుకున్న దానివి కన్పించావన్న సంతోషంతో నా శరీరము అవశమైపోగా ఏవేవో అంటున్నాను. క్షమించు. నేను ఎవర్నో జ్ఞాపకం రాలేదా ? అంతత్వరగా ఎల్లా మర్చిపోగలిగావ్ నన్ను ?" రెండు జబ్బలూ పట్టుకుని కూర్చోపెట్టాడు. చంద్రుడు ఏం జరుగుతుందోనన్న ఆత్రతతో రాకెటు వేగంతో ఆకాశం మీదికి పరుగు మొదలెట్టాడు. దూరంగా కారులు స్టార్ట్ చేయటం, అందమైన తల్లులు పిల్లలకోసం వెతుకుతూన్నట్లు నటి

స్తూంటే వారికి సాయం చేయడం కోసమే కాచుకు కూర్చున్న యువకుల అడ్డప్రశ్నల్లో సముద్రపుహోరు కలిసిపోయి సీతని అయోమయావస్థలో పడేశాయ్. భయంగా అతని ముఖంలోకి చూసి

"నన్ను వదలండిప్లీజ్ ! నాకు మీరెవరో తెలీదు ప్లీజ్ !!" అన్నది. అతను ఫ్రీగా నవ్వాడు.

"నీకు తెలీకపోవచ్చును. నాకు తెలుసంటున్నాగా! మా ఇంటికి పద! నెమ్మదిగా నీకే జ్ఞాపకం వస్తాయి అన్నీ!" అని చేతులు వదలకుండానే లేవదీశాడు. సీతకు హృదయం దడదడలాడింది:

"భగవంతుడా? కలలో కూడ అనుకోలేదు. తన కోసం తపించే మగవాడుంటాడని. ఏమిటిలా తయారయ్యింది పరిస్థితి? తన్నెరుగున్నానంటున్నాడు. తన్ని చూట్టానికి వచ్చిన పెళ్ళికొడుకులందరూ తనకు బాగా జ్ఞాపకమే. ఇంత స్టేటస్ గా వున్న వాళ్ళని తన్ని చూట్టానికి తనతండ్రి ఎప్పుడూ ఆహ్వానించలేదు. ఏందారి భగవంతుడా? అని విలవిల్లాడసాగింది సీత.

"ఎందుకింత కంగారు సీతా? ముందు కారెక్కు! తరువాత నన్ను గురించి ఆలోచిద్దువుగాని."

ఆమాటలువిని కళ్ళు తెరిచింది. ఒక్కసారి జాగ్రదవస్థలోనికి వచ్చింది. కాడిలాక్ కారు ఎదురుగా నోరు తెరుచుకున్న సింహంలావున్నది, ఆమెకళ్ళకి తాము వదలివచ్చిన చోటుకోసరం వెనక్కి చూసింది. నూరు గజాలదూరం అతని చేతుల్లోంచే నడిచివచ్చానన్న స్ఫూర్తి రాగానే ఆమె కుంచించుకపోయింది. స్థాణువులా నిలబడిపోయింది. అతను ఆమెకేసిచూసి నవ్వాడు.

"ఏమిటిసీతా? మాటిమాటికీ చంటిపిల్లలా మారాం చేస్తావ్? ఇంటికెళ్లాక నేను అంతా చెప్తాగా? ముందు కారెక్కు. మళ్లీ ఎవళ్ళన్నా చూస్తే పెద్దగొడవ అయిపోగలదు" అన్నాడు. ఎదురుగా వచ్చే కారు హెడ్ లైటు వెలుతురుకు ముఖం ప్రక్కకు త్రిప్పుకుంటూను. సీత సుషుప్తిలోకి వెళ్లిందాని మళ్లే కారులో కూలబడింది. డ్రైవరు సీటులో స్టీరింగుముందర కూర్చుని కారు స్టార్టు చేయబోతూ వెనక్కి తిరిగి "ఇంటికెళ్ళేదాకా నన్ను జ్ఞాపకం చేసుకోవటం మొదలెట్టు!" అన్నాడు.

ఆ చనువు ఆ మాటలు ఎక్కడో పూర్వజన్మలో విన్నట్లుగా తోచాయ్. ఎంత తరిచినా జ్ఞప్తికి తెచ్చుకోలేకపోతోంది. స్ట్రీటులైట్లు వరసాగ్గా వెనక్కి పోతూంటే తారురోడ్డుమీద మెత్తగా జారిపోయే కారులో తను ప్రయాణిస్తున్నట్లు గుర్తురాగానే సీత మనస్సు జీవితంలో ఒకపర్యాయమైనా ఖరీదయిన కారులో తిరిగిన ఘనతకు గర్వించింది! ఇతను తన్ని ఎందుకు తీసుకవెళ్తున్నట్లు? బాగుంది. మహాబాగుంది. తన చచ్చుప్రశ్న! ఒక ధనికుడయిన యువకుడు స్త్రీని ఎందుకు తీసుకువెళ్తాడు? సీతకు మగత క్రమ్మి మూర్ఛ వచ్చినట్లు ఫీలయింది. ఆమె కళ్లు తెరచేటప్పటికి కారు తలుపుతీసి ఎదురుగా నవ్వుతున్న యువకుడు కనపడ్డాడు. గమ్యస్థానము వచ్చింది కాబోలుననుకుని అతని చేయి ఆసరా అక్కర్లేకుండానే దిగేసింది. అజిత్ సింగులా వున్న ఒకమనిషి ఆ యువకుణ్ని సీతనీ మార్చి మార్చి చూడసాగాడు.

"చూడు ఆలీ! వనమాలకి నేను ఈ రాత్రికి రానన్నానని ఫోనుచెయ్యి" అన్నాడు. వనమాలా! వనమాల! ప్రఖ్యాత ఫిలింతార! సీతకు కొంచెం కొంచెం అవగతమయింది. ఇతనెవరో సినిమాలకి "ఎక్స్ట్రా సప్లయర్" అయివుంటాడు. తన్నుగూడా ఇందులోకి దింపుదామని తీసుకొచ్చి వుంటాడు. తను సినిమాల్లోకి పనికివస్తుందా! ఏమో! సముద్రంవొడ్డున తెగవరించాడు మహానుభావుడు. వరాండాదాటి హాలులో ప్రవేశించారు. హాలంతా అయిదారువందలు ఖరీదు చేసే కార్పెటు పరుచబడివుంది. ఎర్రని ముఖమల్ సోఫాసెట్టులు. ఒకవారగా రెండు టేబులుమీద "మార్బల్ స్టోను"తో మలచబడిన తాజ్ మహల్ రిప్లికా. ఫాన్ గాలికి వూగుతూ గలగల్లాడే ఛాండిలియర్స్, చూస్తూంటే సీతకి తానొక అరేబియన్ రాకుమార్తెనయినా నేమోననే భ్రమకలిగింది. తనవంటిమీద సాయంత్రం ధరించిన లేతగులాబీరంగు వాయిల్ చీరే వుంటంచేత తనొక మామూలు అమ్మాయిననీ ఇంకొకరి ఇంట్లో అతిథిగా వున్నాననీ నిర్ధారణ కొచ్చింది.

"పైకిపోదాం. అక్కడ మాట్లాడుకోవచ్చును. పిన్నిగారూ? రెండు భోజనాలు పైకి పంపించండి" అన్నాడు, హుషారుగా ఆయువకుడు.

"నాకు శనివారం. నేను భోజనం చెయ్యను. ఈపూట" అనేసింది సీత.

"అలాగా! అయితే ఫలహారం చెయ్యి. పిన్నిగారూ భోజనం కాదు. ఫలహారం, ఫలహారం. వూ.

పద" అని సీతని అడక్కుండానే చేయిపుచ్చుకుని మేడవైపు లాగుకునిపోయాడు. అతని సాహసానికి కోపం వచ్చినా సీతకు కొంచెం భయం వదిలింది.

"అలా లాగేయకండి. నేను మీ వెంటే వస్తాలెండి. చెయ్యినొప్పి పుట్టుతోంది" అని నెమ్మదిగా చేయి విడిపించుకుని అతనివెంట నడవసాగింది. మెట్లకిరువైపులా వాలుగా నున్నగా జారిపోయిన ఇనుప కడీలను చూస్తూంటే ఆమెకు జరజరా ప్రాకిపోయే నల్లత్రాచులు జ్ఞాపకానికొచ్చాయ్. డిమ్‌గా వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బులు లేత వెన్నెల స్ఫురించగా చలువరాతి మేడమెట్లు ఒక్కొక్కటీ వెనక్కిపోతూంటే వారిరువురూ వాల్కనీ దాటి ఒక గదిలోకి వచ్చారు. అది కూడా పొడవుగా ఒక చిన్న హాలంత వున్నది. గాద్రెజ్ పందిరిమంచం, పైన నెమలి ఆకారంలోంచి వ్రేలాడుతున్న దోమతెర, లేత నీలి ముఖమల్ కవర్స్ తొడిగిన "డన్‌లోపిల్లో" సోఫాలు, నాలుగడుగుల అద్దం అమర్చిన బీరువా. వేరొక అద్దం అమర్చిన డ్రాయరుమీద క్రిల్ క్రీమ్, పౌడరు, మొదలయిన టాయిలెటు సామగ్రీ ఆకాశం కన్పించేటంత పెద్ద పెద్ద కిటికీలకు పలుచగా కట్టబడిన నైలాన్ కర్టెన్లు, పరీక్షిస్తూ సీత నిలబడిపోయింది.

"కూర్చో సీతా ? నిలబడిపోయావేం ? చాప వెయ్యమంటావేమిటి ? అలా సోఫాలో కూర్చో. మరేం ఫరవాలేదు" అన్నాడు. సీత గది అంతా కలయ చూస్తూ ఒక సోఫాలో కూర్చుంది.

"ఏమిటి సీతా ఈ మౌనం? నువ్వింకా షాక్ నించి తేరుకోలేదు కదూ?" సీత అతనికేసి ఏదో వెతుకుతున్నట్టు చూసింది.

నేనెవర్నో జ్ఞాపకం రావటం లేదూ?

వూహూఁ అన్నట్టు తల అడ్డంగా వూపింది. ఈలోగా గది తలుపులు త్రోసుకుని శ్వేత కిరీటధారిణి వచ్చింది.

"పిన్నిగారూ? కొంచెం ఫలహారం పంపించండి ఈమెకి"

"మరి నువ్వో?" అన్నది ఆమె చనువుగా.

"నాకూ ఫలహారమే. భోజనం తర్వాత చేస్తాను." ఆమె సీతను నిలువునా పరీక్షించిమాసి క్రిందికి వెళ్లిపోయింది. సీత అతన్ని ఏదో అడగబోతుండగా ఒకమ్మాయి ట్రేలో ఫలహారం తీసుకవచ్చింది. రెండు ప్లేట్లలో మధ్యకికోసిన కాబూలుదానిమ్మ చెక్కలు, రెండేసి తెల్లచక్కరకేళీ అరటిపళ్లు, ఎర్రగా పండిన రెండు ఆపిలుపళ్లూ, రెండు నల్లద్రాక్షగుత్తులూ, నాలుగు ఒలిచిన కమలాఫలాలు, రెండు గ్లాసుల్లో చిక్కని పాలూ, రెండు చిన్న పింగాణీ గిన్నెల్లో చక్కెరా, వున్నయ్. అవి గోడకి వారగావున్న నునుపచ్చని గాజు పలక బిగించిన డ్రాయరుమీద వుంచి గోల్డ్ కలరుతో అశోకచక్రం చెక్కిన వెండి కూజాలో అగరు వత్తులు వెలిగించి కిటికీలకున్న నైలాన్ కర్టెన్లు వత్తిగించి అవతలకు పోబోతూంటే.

"అనసూయా? కాస్త తాంబూలం సామగ్రి కూడా ఇచ్చావంటే ఇక నిన్ను పిలవను" అన్నాడు.

"సీతా! ఇలావచ్చి ఫలహారం చెయ్యి!" అన్నాడు తనొక పేముకుర్చీలో కూర్చుని పళ్లెం ముందుకు లాగుకుంటూ. సీత తటపటాయించింది.

"రా? అనుమానిస్తావేం? మళ్లీ చేయి చేసుకోవాలా ఏం? "ఈ జబర్దస్తీ ముందెన్నడో అనుభవమయినట్టుగా జ్ఞాపకాలపొరలు తెరలుగా కదులుతున్నాయ్. లేచి నుంచుంది. "వూఁ బలే నేర్చావే? అడుగే ఆమడగా అవుతోంది అమ్మాయికి! నేను ఆకలికి ఆగలేను. గమ్మున రా! మరి!" అన్నాడు. ఈ మాటలు అన్నీ తనెప్పుడో విన్నవే! ఈ ధోరణి తనకు కొత్త గాదు. యాథాలాపంగా డ్రస్సింగు టేబులు వేపు చూసింది. ఫోటో స్టాండులో తనకు చిరపరిచితమయిన అబ్బాయి ముఖం చిరునవ్వు చిందుతూంది. చేతుల్లోకి తీసుకుని చూసింది. వెనక వెంపు "దీపక్ వర్మ!" అని వుంది. ఒక్కసారి త్రుళ్లిపడింది, సీత. దీపక్ వర్మ! వేల కన్నెల కన్నుల్లో దీపాలు వెలిగించే దీపక్ వర్మ! ప్రఖ్యాత నటుడు. తన బాస్ కూతురు పెళ్ళంటూ చేసుకుంటే "దీపక్"ని తప్ప మరెవ్వరినీ చేసుకోనని ప్రతినపట్టింది. అప్రయత్నంగా అతని దగ్గరగా వెళ్ళింది. ఆబగా అరటిపండు నోట్లో కుక్కుకుంటున్న అతని ముఖంవేపు గుచ్చి చూసి "మీరూ! మీరూ!! దీపక్ వర్మా!!!" అన్నది.

"అవును. ఏం?"

"ఏం లేదు." కళ్లు పెద్దవిచేసి ఆలోచనల్లో పడింది.

"మళ్ళీ మొదటికొచ్చావూ! నాదయిపోయింది. ఇంక నీ వంతు. ఛా! ఇల్లా బ్రతిమాలించుకోవటం ఏం

బాగుండలేదు. నీవంటి మంచమ్మాయిలు బ్రతిమాలించుకోరు. మీరే మమ్మల్ని బ్రతిమాలాలి" ఆమె చేయి పట్టుకుని కుర్చీలో కూర్చోపెట్టి ద్రాక్ష గుత్తిని ఆమె పెదిమలమీద పెట్టాడు. ఒక పండు త్రుంచి నోట్లో వేసికొని "అబ్బ! చచ్చే పులుపు!" అన్నది చనువుగా.

"పులుపు అందనివాటికి. అందాయిగా! ఇంక తీయగానే వుండాలి!" అన్నాడు. అతని మాటల్లోని శ్లేషకి చిరాగ్గా చూసింది సీత.

"ఎందుకింత అలక సీతా? నిజంగా ఈ దివ్యమైన భవనం, కారూ, నెలకు లక్షరూపాయలార్జించే నావంటి భర్తా వస్తుంటే కాదనగలిగే ధైర్యం మీ ఆడవాళ్ళకుంటుందా? నీకు ఇవన్నీ చూస్తుంటే ఈ భోగభాగ్యాలన్నీ నీ జీవితాంతం వరకూ ఉండేలాగున చేయమని భగవంతుని ప్రార్థించవూ? ఇప్పుడు నీ మనసు నాకు తెలీటంలేదనుకున్నావా సీతా?" సీతకు లజ్జవేసింది. ఏ ఆడపిల్ల అయినా బంగారుకలలే కంటుంది. మనస్సుపరిభ్రమించటానికి పరిధిలేదు. చాపమీద వొరిగి నిద్రపోయే ఆడపిల్లకూడా! ఏనాడో ఒక రాజకుమారుడులాంటి వాడు తనను చేపట్టి తను వూహించలేని దివ్యలోకాలను చూపిస్తాడని ఆరాటపడుతుంది కన్నెహృదయం. తను స్వప్నంలోనైనా తలవగలేనివాడు దీపక్! నక్కెక్కడ నాగలోకమెక్కడ? అతనికి తనమీద దయకలగటం తన పూర్వజన్మ సుకృతం! "బాస్" కూతురు వనజ విన్నదంటే ఆమె హార్టు ఫెయిలవటం తథ్యం. ఆమె అచ్చంగా సినీతారలా సింగారించుకుంటుంది. బాబ్డ్ హెయిర్, చెవులకు ఎర్రరాళ్ల రింగులు, చేతికి వజ్రాలుపొదిగిన వాచీ, టిష్యూల్లో జరీవున్న చీరలు. ఆమె హేండ్ బాగ్‌లో ఎప్పుడూ దీపక్ వర్మ ఫోటో ఉంచుకుంటుంది. ఆమె వచ్చిందంటే తమ ఆఫీసులో పెద్ద సంచలనం బయలుదేరుతుంద. ఫైళ్లు వ్రాయటం మానేస్తారు క్లర్కులు. ఇరువదినాలుగ్గంటలూ, ఫైళ్లల్లో తలదూర్చివుండాల్సినవాళ్లకి వనజ రాక ఆనందరేఖ! "టై" సర్దుకునేవాడొకడూ, జేబులోంచి అద్దంముక్క తీసి ముఖం చూసుకునేవాడొకడూ. నానా అవస్థలూ పడతారు వనజకోసం. ఆమెచూపు చూడపోతే "దీపక్"మీద. ఈ దీపక్ మీద!! సీత లోలోపల నవ్వుకున్నది. ఆ నవ్వుతో ఆమె ముఖం ప్రఫుల్లమైంది. పట్టలేని ఆనందంతో కాంతివంతమైన ఆమె నుదురు చూస్తూ పాలగ్లాసు నోటికి అందిచ్చాడు. గ్లాసుపుచ్చుకుని పాలన్నీ త్రాగేసింది. "ఇక చెప్పండి" అన్నట్టు అతనికేసి చూసింది.

"అనసూయా? ఇవన్నీ తీసెయ్య!" అన్నాడు. అంతవరకూ వరాండాలో నించున్న అనసూయ వచ్చి "ట్రే" తీసుకుంటూ "మీకు ఫోను వచ్చిందండి. అలీ రిసీవ్ చేశాడు. నయనతార కామోసు చేస్త" అన్నది.

"ఫోను ఎవరయితేనేం? ఈ రాత్రి నేనెవర్నీ చూడదలచలేదు. మీకు కారుకావలిస్తే తీసుకోండి" అన్నాడు దీపక్. సీతకు ఏమీ తోచటంలేదు. కళ్లు బరువెక్కాయి. ఆవులిస్తూ చిటికెలు వేయసాగింది.

"ఏం నిద్రోస్తుందా! ఆ మంచంమీద పడుక్కో! నిరభ్యంతరంగా!" అన్నాడు దీపక్. సీతకి నిజంగా నిద్ర ముంచుకువస్తోంది. కాని ఈ ఆతిథ్యానికి కారణమేమిటో అడగాలి! అడిగితే చెప్పే జవాబు ఆమెకు లీలగా తెలుసుకున్నది. కాని ఆభావం మనస్సులోకి వచ్చేసరికి శరీరం కంపించసాగింది. ముందర ఎక్స్‌ట్రా సప్లయర్ అనుకున్నది. ఇంతలో హీరో "దీపక్" అయి కూర్చున్నాడు. ఇంకా ఎన్ని అవతారాలు ఎత్తుతాడో ఈ మహానుభావుడు? ఇతని నిజస్వరూపం తెలుసుకోవాలన్న ఆకాంక్ష ఆమెకు అధికమయింది. ఏదో ప్రమాదం శంకిస్తూనే తెగించి అడిగేసింది.

"మీరు! నన్ను ఇలా పిల్చుకురావటానికి కారణం......!" నీళ్లు నమిలేసింది. దీపక్ పెద్దగా నవ్వాడు. దగ్గరగావచ్చి ఆమె వీపుమీద ఒక్క చిన్న చరుపు చరిచాడు. ఒక్కసారిగా సీతకు మత్తు వదిలింది. పదేళ్ళక్రితం ఈ శర్మ తనకు ఆప్తుడు!

"నువ్వా నువ్వేనా శర్మ!" ఆనందంతో అనేసింది.

"అమ్మయ్య! ఇప్పటికి తెలిసివచ్చింది అమ్మాయికి. ఇందాకణ్ణించీ ఒక్కడ్నీ "విరహగీతం" పాడుకోలేక ఛస్తున్నా ననుకో సీతా!"

"ఇప్పుడు డ్యూయెట్లు మొదలెడ్దామంటావేమిటి!" అంది తేలిగ్గా నవ్వేసి. "ఓ తప్పకుండా! కాని నాకు ప్లేబాక్ పాడించాలి. నీకు తెలుసో తెలియదోమరి!" ఇద్దరూ వెనక్కి చూసుకున్నారు.

2

పదేళ్ళక్రితం శర్మ రాజమండ్రిలో సీతావాళ్ళింట్లో అద్దెకుండేవాడు. ఏం చదివేవాడో తెలీదుకాని అస్త

మానం కిటికీలో కూర్చుని దొడ్లోకి చూసేవాడు. అవి సీత కొత్తగా కండువాలు వేసుకు నేరోజులు. మొదట్లో దొడ్లోకి ఏంపనిమీదవచ్చినా కిటికీలో కూర్చున్న ఇతన్ని చూసి చిరాకుపడేది. ఇతనికి చదువూ సంధ్యా లేదు లావుంది అనుకునేది. రెండు సినిమాలు చూసి అందులో తత్వం జీర్ణించుకొన్నాక ఇతను తనకోసమే కూర్చుంటున్నాడు. అని స్పష్టపరుచుకుంది. ముందు కోపంవచ్చినా రానురాను అతనిమీద ఆపేక్షకలిగింది. ఎప్పుడయినా తను పెరట్లోకివచ్చేసరికి అతను కిటికీలో కనపడకపోతే ఏదో వెలితి అనిపించేది. కిటికీలోంచి తొంగిచూసేది. అతను చాపమీద నిద్రపోతూనో, ఏవో పుస్తకాలు చదువుతూనో కనపడేవాడు. ఆరోజుకుపూర్వం అతను నాలుగురోజులనించీ కిటికీలో కూర్చోవటం మానేశాడు. సీతకు కోపమువచ్చింది. ఏమయితే అదవుతుందని మొండి ధైర్యముతో కిటికీ దగ్గరసావెళ్లి

"ఏమండీ" అని పిల్చింది. అతను చాపమీద బోర్లగిల పడుకున్నాడు.

"ఏం? ఇవ్వాళా మిగలలేదా?" అన్నాడు లేవకుండానే. సీతకు అర్థంకాలేదు. ఏమిటో.అనుకున్నది.

"కాదు నేనూ" అంది. ఒక్కసారిలేచి నిలబడి కిటికీ దగ్గరసావచ్చి "నువ్వా! ఇంటి వారమ్మాయివా! ఏం?" అన్నాడు. ఏం? అంటే ఏం చెప్తుంది సీత మాత్రం? చెప్పలేని సిగ్గువేసింది. ఎలా అడుగుతుంది? మీరు కిటికీలో కనపడటం లేదేం అని కదా తాను అడగదల్చుకున్నది? తలవంచుకుద్నది సీత. ఏంమాట్లాడాలో తెలీక నవ్వుతున్నది. అతను తలుపు తీసి చేయిపటుకుని "లోపలికిరా! ఇక్కడేం మాట్లాడుతావు!" అని చాపమీద కూర్చోపెట్టాడు. సీత బుద్ధిగా కూర్చుంది.

"ఏం పిల్చావు?" సీత మాట్లాడలేదు.

"బాగానే వుంది. పిల్చినదానివి ఎందుకు పిలిచావో చెప్పటానికి సిగ్గయితే ఎల్లాగ? ఏవన్నా పుస్తకాలు కావాలా!" రెండు కినిమాలు, నాలుగు భారతులు ఆమెముందర పడేశాడు. సీత అవి తిరగేసింది. వెళ్లే ప్రయత్నం చేయలేదు.

"ఏం చదువుతున్నావు?"

"ఘోర్తుఘారం"

"వూహుఁ. అయితే నీకు కథలు అర్థంకావు కినిమాలు చదువుకో చాలు." భారతులు తీసి దాచేశాడు.

నీకు పాడటం వచ్చునా?

రానట్టు తలతిప్పింది.

పోనీ మాట్లాడటం?

తలెత్తి అతని ముఖంలోకి చూసి చటుక్కున తల వంచేసింది.

"అభ్భా! గుడ్ గర్ల్!" వీపుమీద ఓ చరుపు చరిచాడు. సీతకి వీపు మండింది. మెదడులోకి కారంగా ఎక్కి పొలమారింది. వుక్కిరిబిక్కిరయిపోయి కళ్లు నీళ్లపర్యంతమయింది.

అబ్బ! అన్నది, బాధగా. ఈలోగా వాళ్ళమ్మ కేకేస్తే లోపలికి పరుగెత్తుకుపోయింది. సీత పొడుగాటి జడలోని రిబ్బను ముక్క నూనెజిడ్డువల్ల జారి అతని మీద పడింది!

మర్నాడు కిటికీక్రిందనించి సీత పోతూవుంటే జడపట్టుకుని గుంజాడు.

"అబ్బ! అలా గుంజుతావేమిటి? మోటుగాను! పిలిస్తే పలకనా?" అంది.

"నీదొకటి దొరికిందినాకు అన్నాడు. తెల్లగా కోలగావున్న అతనిముఖములోని నల్లటికళ్లు తమాషాగా మెరిశాయ్. సీత గాభరాగా చెవిలోలకులు తడుముకొంది. "ఏమిటో చెప్పు" అడిగింది. కుతూహలంగా. జేబులోంచి రిబ్బనుముక్క తీసి ఆమె ముక్కుదగ్గర పెట్టాడు. నూనెకంపు! ఓక్!! అబ్బ!

"ఏమిటే వెకిలితనం నీకు కర్మ!"

"మాట! సినిమాకు వెళ్దామా!" సీత చురుక్కుమనేలా చూసింది.

"నీకు చూట్టమేకాని మాట్లాడటం రాదా! వుండు. లోపలికివచ్చి మాట్లాడుదువుకాని" అంటూ తలుపు తీశాడు.

"నాకు పనుంది బాబూ!" అంటూనే లోపలికి వచ్చి చాపమీదకూర్చుంది.

"నేనొకటి చెప్తా! కోపం తెచ్చుకోకూ!" ఏమిటన్నట్టు చూపింది."

"అలా గుడ్లెట్టుకుని చూడకపోతే ఏమిటని అడగలేవూ? పలుకే బంగారమేమిటి? అది సరేకాని,

ఇంటికి పెద్దమ్మాయివికదా ఇలా తిరగొచ్చా! మీ కుటుంబం అంతా అప్రతిష్ఠపాలు కాదూ?" అన్నాడు. శర్మ లాలించినట్టుగా.

"ఓ యబ్బో! ఎల్లా తిరిగేనేమిటి?"

"ఇల్లాగే చిట్టీ! పట్టుమని పధ్నాలుగేళ్ళు లేవు. అప్పుడు బోయ్ ఫ్రెండ్స్‌తో మాటలు కలపాలని ఆరాట పడుతున్నావ్!"

"కేనేం ఆరాట పడలేదు వీతో మాట్లాడాలని. నువ్వే రోజూ కిటికీలో కూర్చుని నాకేసి ఒక్కగా చూస్తూంటే జాలేసి పోనీకదా! అని నేస్తంచేస్తే ఇదా నువ్వనేదీ?" వుడుకు మోత్తనంగా అంది.

"బాగుంది. సీతా! మహాబాగుంది. నీకోసం కాదు. నేను కూర్చునేది. మీ ఇంట్లో పనిమనిషి నాకు అన్నంతెస్తుంది దానికోసం నేను కూర్చుంటే...

"అన్నమా?" అంది సీత ఆశ్చర్యపోయి "అవుమ తింటానికి. అది పనిచేసేచోట చాలా అన్నము మిగులుతుందిట. నాకు ఒక వేడ డబ్బులికి అమ్మేస్తుంది. ఒక అణా మజ్జిగ కొనుక్కుని ఆవకాయ వేసుకుని తినేస్తాను. మూడణాలతో కడుపు నిండిపోతుంది." అన్నాడు. సీతకు జాలేసింది. తనుమాత్రం ఏంచేయ గలదు? ఇంట్లో ఏదయినా "టిఫెన్" చేస్తే తనవంతు పట్టుకు వచ్చేది. ఇద్దరూ పంచుకుని తినేవారు. శర్మ చాలా మంచివాడు అనుకునేది. ఫోర్తుఫారం పరీక్షలయిపోయాయ్. శర్మ శెలవల్లో వూరికి వెళ్ళకపోవటం చూసి—

"నీకు ఇంకా సెలవులు ఇవ్వలేదా?" అంది.

ఇవ్వకేం ఇచ్చారు."

అయితే ఇంటికి వెళ్ళలేదేం?

నీకోసం వుండిపోయాను, సీతా!

ఛా! ఛాఛా "నా కోసం నువ్వుండడం ఏమిటి? ఇంటికెళ్ళి అమ్మ నీ నాన్నని చూడ్దామని లేదూ?"

వాళ్ళుంటేగా వెళ్ళటానికి! చెయ్యటానికి!" అన్నాడు విచారంగా. సీతకు శర్మంటే ఎంతో జాలి వేసింది. అమ్మానాన్నా లేకపోతే ఇంకెలాగ అనుకున్న ఆమె లేతహృదయం అతనిమీద ఆపేక్ష నింపుకుంది.

ఒక రోజు శర్మ మరీ బలవంతం చేశాడు, తనతో సినిమాకు రమ్మని.

"నేను రాను మా వాళ్లు తిడతారు." అంది.

"నేను అడుగుతా మీ అమ్మగారిని" అన్నాడు.

వద్దు బాబూ! కావలిస్తే మా చెల్లెళ్ళని తీసుక వెళ్లు. నీకు డబ్బెక్కు వుంటేను!" అంది.

"వాళ్లెందుకూ ఏడ్చి మొత్తుకోడానికి? నాకు నువ్వే కావాలి!" సీత జడంతా విప్పేశాడు.

"అబ్బబ్బ! చచ్చిపోతున్నాను శర్మా నీతోటి! ఇప్పుడు నా జడంతా విప్పేస్తావు ఎల్లాగ? అవతల అమ్మావాళ్లు కేకేస్తోన్నారు." విసుక్కుంది, సీత.

"నాకు నీ పొడుగాటి జడంటే బలే ఇష్టం. సగం కత్తిరించి నాకిచ్చేయి నీకు నూనెఖర్చు తగ్గుతుంది. నాముచ్చటా తీరుతుంది."

"నీ కెందుకు ఆ ముచ్చట? సవరం కట్టించుకుని జడేసుకుని పూలు పెట్టుకుంటావా? వెధవ వేషాలూ వెకిలి మాటలూ."

"ఇదుగో! వెధవా గిధవా అని రానీకు సుర. ముందే చెప్తున్నాను."

"ఏం అంటే! అంటానా! అని తీర్తానా!" వీపుమీద ఒక చరుపుచరిచాడు, శర్మ.

"అబ్బ! నన్ను ఇలా కొంచెం కొంచెం కొట్టి బాధించకపోతే పూర్తిగా ఒక్కసారి చంపేయు కూడదూ?"

"ముద్దు కిలా చేశానుకాని విన్ను చంపగలనా సీతా?"

"మొద్దుపనిచేసి ముద్దుముద్దు అంటావేమిటి నా మొహం?"

ఒకరోజు వాన జోరుగా కురుస్తోంది. చూరు క్రిందనించి నడుస్తూ శర్మకోసం ఉప్పుపిండి పొట్లం కట్టితెచ్చింది సీత. తలుపు తీస్తూనే

"ఒకమాట సీతా!" అన్నాడు.

ఏమిటన్నట్లు చూసింది.

"నాకు పదిహేను రూపాయలు కావాలి. అర్జంటు."

నా దగ్గ రెక్కడ్నుంచి వస్తయ్?

నీ దగ్గర లేవా?

వూహూ.

"వున్నయ్. నేను చూపిస్తాను. ఇయ్యవా?"

"ఏవీ?" అంది ఆశ్చర్యపోయి."

"నీ లోలకులు డబ్బుకాదేమిటి? అవి అమ్మితే వస్తయ్. రూపాయలు."

"అమ్మయ్యో !! మావాళ్లు తవ్వి పాతరేస్తారు." అన్నది.

"మరేం ! ఫరవాలేదు. ఎక్కడో పడిపోయా యని చెప్పు."

"బాబోయ్ ! నేను చచ్చినా ఆ పని చేయ లేను." అన్నది.

చటుక్కున దగ్గరగావచ్చాడు శర్మ.

"ఎందుకు చేయవు సీతా చెప్పు ! మన భారత మహిళలు భర్త ఉన్నతికోసం ఎంతెంత త్యాగాలు చేసేవారు? ఇలా నువ్వు ముష్టి మూడురూపాయల లోలకులను నా కోసం త్యాగం చేయలేవూ సీతా? ఎప్పటి కైనా నీ డబ్బు అణాపైసలతో లెఖ్ఖకట్టి ఇచ్చే స్తాను. సరా!" ఆమె రెండు చెంపలు నొక్కుతూ పుట్టుమచ్చవున్న కుడిచెంప తటాలున ముద్దుపెట్టు కున్నాడు. సీతకు చిరాకేసింది. చెంపను పమిట చెరగుతో తుడుచుకుంటూ నిలబడిపోయింది. శర్మ సర్వస్వతంత్రంగా సీత చెవిలోలకులను తీసుకున్నాడు. వానలో తడుస్తూనే బజారు వెంపు వెళ్ళిపోయాడు. సీత అలానే చాపమీద కూలబడింది. అరగంటలో ఈలవేసుకుంటూ వచ్చాడు శర్మ.

"మన అదృష్టం సీతా ! ఒక లోలకు అమ్మితేనే ఇరవయి రూపాయలు వచ్చాయి. తీసుకో నీ లోలకు" అని రెండోది సీతకి ఇచ్చాడు. సీత ముఖం విరిసిన చామంతిల్లే అయింది. "ఇప్పుడు మా వాళ్ళు లోలకు పడిపోయిందన్నా నమ్ముతారు." అని ఒక చెవికి లోలకు పెట్టేసుకుంది. ఆనందంలో అలవాటుగా వీపు మీద ఓ చరుపు చరవబోయాడు. ఆమె తప్పించు కుంది ! "ఇదుగో ! ఈ అయిదూ నీ దగ్గర వుంచు సీతా !"

"ఎందుకు? నువ్వే వుంచుకో శర్మా!" అంది.

"అఖ్ఖర్లేదు. నేను అడిగింది పదిహేనేకదా!" బలవంతంగా సీత వద్దన్నా వినకుండా ఆమె చెంగున ముడేశాడు. మర్నాడు తెల్లవారేసరికి నాన్నగారు ఎవరిమీదనో కేకలేయటం విన్పించింది. బద్ధకంగాలేచి ఇవతలికివస్తూ,

"ఏమయింది నాన్నారూ?"అంది ఆరిందాలాగ.

"ఏంలేదమ్మాయ్ ! మనగదిలో లేడూ ? ఆ రాస్కెల్ ! రెండు నెలలనుంచి అద్దె నయాపైసా చెల్లు పెట్టలేదు. ఇవ్వాళ్ళ? తెల్లవారేసరికి మాయమయ్యాడు. ఎవర్నని అడగం? పోనీ అమ్మదామన్నా ఏంలేవు వాడి గదిలో !" అన్నారు సీత నాన్నగారు. సీతకు భయ మేసింది. శర్మ గదిలోకెళ్లింది. చాపా, మంచినీళ్ళ కూజా, పాతసినిమాపత్రికలూ అల్లానే వున్నయ్. అతను వున్నప్పుడు మాత్రం మహా సామాను ఏడిసింది కనకనా! ఆ పత్రికలన్నీ పనిచేసేదాని కిచ్చి గది కడి గించి ఇవతలకు వచ్చింది. ఆ రోజల్లా సీతకు ఏం తోచ లేదు. సంవత్సరందాకా శర్మనుగురించి ఆలో చిస్తూనే వుంది. ఆ కిటికీ క్రిందనించి నడుస్తూంటే జడ ఎవరో గుంజుతున్నట్లు భ్రమించేది ! ఎప్పుడో వస్తాడు. రాకేం చేస్తాడు? తన పదిహేనురూపాయలు తన కివ్వద్దూమరి? క్రమంగా అతన్ని మర్చిపోయింది.

3

ఇప్పుడు మళ్లీ అతనికేసి చూసింది. శర్మకూడా సీతకేసి తదేకంగా చూస్తున్నాడు.

"నీలో చాలా మార్పువచ్చింది శర్మా ! పత్రి కల్లోనూ సినిమాల్లోనూ చూస్తూకూడా ఆనమాలుపట్ట లేకపోయాను. ఇలా అవగలవని ఎన్నడూ వూహించ లేదు." అంది.

"మరేం మజాకా అనుకున్నావా, శర్మంటే? సీతా నువ్వేం మారలేదుస్మా ! నా కంటికి నువ్వె ప్పుడూ కనపడుతూనే వుంటావు నక్షత్రంలా. 'నీ చేతి చలవ వల్ల నేనింత పైకివచ్చాననేది నా జీవితంలో మరువలేను. నీ పదిహేను రూపాయలకు బదులు వజ్రాల దుద్దులు కొనిస్తాను." అన్నాడు శర్మ ప్రేమగా.

"వజ్రాలవా! నాకెందుకవి? ఎక్కడో దొంగి లించానని జైల్లో వేస్తారు నన్ను" అంది సీత. కిటికీ లోంచి చల్లని గాలి లాన్‌మీది మాలతీపువ్వుల సువాస నని మోసుకొస్తోంది. ఆకాశంమీది చంద్రుడు చుక్కల ధాటికి ఆగలేనట్టుగా మబ్బుచాటుకు తప్పుకుందామని ప్రయత్నిస్తే మబ్బులు అలిగిన భార్యకుమల్లే మరి కాస్తదూరం జరుగుతున్నాయి. సీతలేచి కిటికీదగ్గరగా నిలబడింది. శర్మ వెనకాలనుంచుని

"అదేమా సినిమాల్లో అయితే రాగాలు లంకించు కోవాల్సిన వాళ్ళం. సీతా ! అమ్మా నాన్నగారూ చెల్లెళ్ళూ కులాసాగా వున్నారా?" అన్నాడు.

వూఁ. బాగానేవున్నారు. రాజమండ్రిలో ఇల్లు అమ్మేశారు నాపెళ్లి కోసం" అంది.

"ఇంకా పెళ్ళే కాలేదూ నీకు? మైగాడ్!" అన్నాడు.

"పెళ్ళయితే నీతో వస్తానా శర్మా! బీచిలో నే లెంపలు వాయించేదాన్ని."

"నువ్వయితే సంతోషిస్తానుకాని, మీ ఆయన అయితేమాత్రం తిరగబడతాను."

"ఇంక వస్తాను శర్మా! పొద్దుపోలేదూ?" అంది.

"ఆగాగు. చిన్న మనవి. ముందు నువ్వెక్కడుంటున్నావో ఏమిటో నాకు చెప్పాలి!"

"ఆళ్వారుపేటలో వుంటున్నా."

పాపం!! ఒక్కర్తివే!

"అవును. కంపెనీలో వుద్యోగం చేస్తున్నాను" అంది.

"అయితే మిత్రావసు గారింటిలో కన్పించలేదేం?"

"ఎలా కనపడతాను శర్మా! ఆయన మామానే జరుకద! మేము సర్వెంటులో వుంటాము. మొన్న వనజ బర్త్ డే పార్టీకి దీపక్ వర్మ "ఛీఫ్ గెస్ట్" అని ఎవరో అంటే విన్నాను" అంది నిర్లిప్తతగా.

"అప్పుడేనా "దీపక్ వర్మ"ని చూద్దామని నీకు అనిపించలేదూ?"

తెలుసుకోవాలన్న దుగ్ధతో సీత భుజంమీద చేయివేసి కిటికీలోంచి కొబ్బరిఆకుల చివరవెలిగే వెన్నెలను చూస్తూ అన్నాడు.

"చూస్తే ఏం వస్తుంది? వయం! అంతమందిలో నన్ను గుర్తుపట్టి వీపుమీద ఓ చరుపు చరిస్తే ఎంత అవమానం? నా వుద్యోగం వూస్టింగయిపోదూ?"

"నీకింకా వుద్యోగం సద్యోగం ఎందుకు సీతా! హాయిగా నాకు దొరికిపోయాక!" ఆమె జడను చేతికి చుట్టుకున్నాడు.

"ఇంక వెళ్లివస్తాను. శర్మా!" అంది, సీత ఏదో భరించలేనట్టుగా.

"అదేకదూ చెప్తోంట సీతా! పన్నెండు అయ్యింది. ఇంతరాత్రి నీకోసం అంతదూరం రాలేను!" అన్నాడు చిలిపిగా.

"నిన్ను రమ్మన్నానేమిటి నేను! నేనుపోలేనా?." విసురుగా అంది. "ఇంక సిటీబస్సులు కదలవు. మా కారు "గరాజ్"లో నిద్రపోతోంది. అంచేత బుద్ధిగా ఆ మంచంమీద బబ్బుని నిద్రపో! కావల్సి వస్తే నేను "లోరీ"లు రికార్డ్సు వేస్తాను. నాకు పాట్టం రాదుకా!" అన్నాడు.

"వొద్దు శర్మా! మా ఇంటావిడ తెలుగావిడ. రాత్రి ఎనిమిది దాటాక ఇంటికివెళ్తే నన్ను తినేసేలా చూస్తుంది. అలాంటిది తెల్లవార్లూ షికార్లుచేస్తే ఇంకేమన్నా వుందా? నన్ను చంపక పోనీ శర్మా!" బ్రతిమాలింది.

"మోడస్టీ పోలేదు, సీతా నీకు? ఎప్పుడూ ఎవరికో ఒకరికి భయపడుతున్నానంటావు. ఆమె అనుకోటానికి ఇప్పుడే ఎక్కువ వీలుంది. తెలుసా నీకు? అర్ధరాత్రి పరాయిమగాడితో కారులోవస్తే ఏం బాగుంటుంది? అంచేత నామాట విను. ఇక్కడే వుండిపో! రేపెల్లాగా ఆదివారమే కదూ. రేపు మనం సరదాగా వూరంతా తిరుగుదాం. రేపు నా ప్రోగ్రాం లన్నీ ఇప్పుడే "కాన్సిల్" చేస్తాను" అన్నాడు ఫోను తీస్తూ.

"కాదన్నా వూరుకోవు కదా శర్మా నీవు? నేరకపోయి నీకళ్ళ పడ్డాను" అంది మురిపెంగా.

"సోమవారం తెల్లవారేసరికి నిన్ను పూలల్లో పెట్టి మీ ఇంటావిడకు అప్పగించేస్తాను. సరా!" క్రిందనించి కారు పార్కుచేయబడ్డ ధ్వని వినపడ్డది. క్రింద హాలులో ఓ ఆడగొంతు విన్పించింది.

"వుండు ఇక్కడే! ఎవరో వచ్చినట్టున్నారు." అని అప్పుడే నిద్రలేచిన వాడల్లే అభినయిస్తూ క్రిందకు దిగాడు శర్మ.

"హల్లో మాలా! ఏమిటి కథ!" అన్నాడు.

"విశేషం ఏంలేదు. "వరుణా"నించి పోతూ నువ్వురాలేనని ఫోనుచేస్తే ఏట్లోనని చూసిపోదామని దిగాను." అంది. రుమాలుతో ముఖం తుడుచుకుంటూ సోఫాలో కూర్చుంది.

"అవును. ఈవ్వాళ హాయిగా నిద్రపోదామనుకున్నాను. కాని నీలాంటివాళ్లు నన్ను నిద్రపోనీరు కదా!" అన్నాడు తమాషాగా.

"నాకోసం రమ్మన్నావనా నీ వుద్దేశం? ఇవ్వాళ రెండువేలతో మొదలెట్టామన్నారు విశ్వంభరం గారు. ఆట!" అంది. ప్రఖ్యాత సినీతార వనమాలను చూడకుండా వుండలేక పోయింది సీత. తన్ను తీసుకవచ్చానని చెప్ప

టానికి శర్మకి సంకోచమెందుకో తెలియలేదు. ఆమె తీయగా సన్నగా ఏవో కబుర్లు చెప్తోంది శర్మతో. సీత నాలుగుమెట్లు దిగి వనమాలను చూసి ఆశ్చర్యపోయింది. ఈమెను స్క్రీన్ మీద దీపక్ తో ఎన్నోసార్లు చూసింది తన మనస్సులో ఆదర్శప్రాయమైన జంటగా వాళ్లని వూహించుకునేది. ఆమెను చూస్తే వాంప్ పాత్రకే కాని హీరోయిన్ గా ఎవరు వూహించగలరో అని దిగ్భ్రమ చెందింది. స్థూలంగా చామనచాయగా వున్న శరీరం చుట్టూ అంటీఅంటనట్లు వున్న అమెరికన్ ఆర్గండీ చీర. హార్స్ టెయిల్ గా కట్టబడిన జుట్టూ, చెవులకి దంతపు జిప్సీరింగులూ, కొట్టొచ్చినట్లు కన్పడే లిప్ స్టిక్కు నవ్వినప్పుడల్లా పిల్లి తలదూరేలా నోరుతెరుస్తున్న ఆమెను ఆ ఎర్రటి సోఫాలమధ్య చూస్తూంటే ఏదో గరగని చూస్తున్న భ్రాంతి కలిగింది సీతకి. ఇంతలో టెలిఫోను గణ గణమంది. వనమాల లేచి ఒయ్యారంగా వళ్లు విరుచుకుంటూ "నీ డార్లింగు కాబోలు. నేపోతా!" అని చెప్పులు చప్పుడు చేస్తూ వెళ్లిపోయింది. సీత క్రిందికి వచ్చింది. సీతతో ఏదో చెప్పబోయేలోగా హాలు కర్టెను తొలగించుకుని వచ్చింది ఒక అమ్మాయి.

"కమిన్ తారా! ఏం విశేషం?" అన్నాడు దీపక్. సీతకు తార అనగానే ఏదో స్మృతికి వచ్చింది. ఈ పిల్ల పేరు ఎక్కడో చదివినట్లుగా గుర్తు వచ్చింది. ఏదో చిన్న సినిమా పత్రికల్లో చదివిన జ్ఞాపకం. ఈ అమ్మాయి ఇంకా పెద్ద తార అవలేదు. చిన్న చిన్న వేషాలు వేస్తుంది. పెద్ద యాక్టర్లని పూసుకు తిరుగుతుంది. పద్దెనిమిదేళ్ళుంటాయి. ఆమె కళ్ళల్లో "దీపక్" మీది ఆరాధన స్పష్టమౌతూంది. తెల్లగా సన్నగా పొడుగ్గా వుంది. బాబ్డ్ హెయిర్. లేత నీలి కమీజు. తెల్లటి సిల్కు గాగ్రా ధరించింది.

"ఈమె నా కత్యంత సన్నిహితురాలు. మిస్ సీతాదేవి! కంపెనీలో క్లర్కుగా వున్నది ప్రస్తుతం."

"రేపటినించీ మీ శెక్రటరీ క్రింద తీసుకుంటారా! ప్రస్తుతం అంటున్నారు?" అన్నది తార జోక్ గా.

"అమ్మయ్యో! మా "లూసీ" గోలెట్టెయ్యదూ! మిమ్మల్ని చూస్తుంటే శే నన్ను నమిలి మింగేస్తూంది" అన్నాడు దీపక్.

"పాపం! అక్కడికీ ఎప్పుడూ స్లీవ్ లెస్ ఫ్రాకులు వేసుకొస్తుంది. అయినా మీరు బొత్తిగా శుకమహర్షి లా ఫోజులేస్తారు దాని ముందు." అంది ఆ అమ్మాయి. సీతకు ఆ అమ్మాయి అంత లూజుగా మాట్లాడటం నచ్చటంలేదు. పమిట భుజంచుట్టూ తీసుకుని సోఫాలో కూర్చుంది. వాతావరణం ఒక నిమిషం స్తంభీభూతమైంది. "వుండు వస్తాను. ఆకలేస్తోంది. నీకేమయినా కావాలేమిటి?" అన్నాడు దీపక్.

"వద్దు. షూటింగు అయిపోగానే మస్తుగా టిఫెను పట్టించాను" అన్నది తార. సీతకు "ఈ అర్ధరాత్రీ, అపరాత్రీ ఈ విజిట్లేమిటీ వీళ్ళకి" అనిపించింది.

"మీరు, దీపక్ తో ఎందులో వేశారో గుర్తు రావటంలేదు. మీ ఫ్రెండా?" అన్నది తార నుద్దేశించి. ఆమె సున్నితంగా నవ్వుతూ "ఐసీ! మై ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్" అన్నది.

"ఏమిటి కోస్తున్నావ్ తారా? ఆమెని హడలగొట్టున్నావేమిటి?" అన్నాడు. దీపక్.

"హడలకొట్టే హడిలిపోయేరకం కాదులెండి. రాక్షసుల్ని జయించిన పతివ్రతలు!" అన్నది, తార. సీతకు ముల్లు గుచ్చుకున్నట్లయింది. ఆమెకు చిన్న

ఆర్ష గ్రంథ మాల

1. తెనుగు అనుష్టుప్-భగవద్గీత	0-6-0
2. ధమ్మపదము (బుద్ధగీత పద్యములు)	0-6-0
3. ఈశకేనకఠోపనిషత్తులు (మూలం. తా. పద్యానువాద సహితము)	1-2-0
4. యోగతత్త్వ దర్శనము (పతంజలి)	0-12-0
5. సిద్ధాంత తత్త్వదర్శనము (వ్యాసుడు)	1-0 0
6. బుద్ధభగవానుడు-జీవితసంఘటనలు మొ॥	2-0-0

— ఇతరములు ...

1. నారాయణీయాంధ్ర వ్యాకరణము నన్నయాదర్వణ కారికావళి సంపూర్ణ ప్రామాణిక వ్యాకరణము విశ్వవిద్యాలయములలో పూర్వముపాఠ్యగ్రంథము.)	4-0-0
2. మెయిలు రాయబారము (మేఘసందేశమునకు సరసమైన తెనుగు)	0-8-0
3. స్వాతంత్ర్యదీక్ష ('మిలన్'కు తెనుగు)	0-4-0
4. కావ్యమంజరి (బిల్హణ విలాసము, 2. అజ విలాసము, 3. శుకరంభా సంవాదము, 4. శ్రీకృష్ణ హృదయామృతములసంపుటి.)	1-0-0

వివరములకు క్యాటలాగు వ్రాయుడు.

సమిశ్రేగూడెము (via) నిడదవోలు, ప. గో. జిల్లా } చర్ల గణపతిశాస్త్రి (ఆర్ష గ్రంథమాల)

సినిమాపత్రికల్లో వ్రాసేదంతా గుర్తుకు వచ్చింది. వీళ్లిద్దర్నిగూర్చి ఎన్నో వ్రాశారు. పెద్దపత్రికలు స్టార్ల వ్యక్తిగత జీవితాలను వ్రాయకపోయినా చిన్న పత్రికలు పాప్యులారిటీకోసం స్టార్లనుగూర్చి వున్నవీ లేనివీ వ్రాస్తారు. అవి నిజమయినా కాకపోయినా భరించటం కష్టం. ఇలా ఆలోచిస్తూ నిద్రలో సోఫాలో వొరిగింది. ఆమెకు దీపక్, తారాకబుర్లు, నవ్వులు, స్వప్నంలోలా విప్పడ్డాయి. శర్మ నెమ్మదిగా ఆమె నుదురుమీద చెయివేసి "సీతా!" అని పిల్చేసరికి ఆమె కళ్లువిప్పింది. చుట్టూ గాభరాగా చూసింది.

"లేచి లోపలికిపద సీతా! కాస్త రెస్ట్ తీసుకుందువుగాని. నాలుగయి పోతూంది." అన్నాడు ఆపేక్షగా.

"శర్మా! నువ్వు నిద్రపోలేదా ఇంకా!"

"మాకు నిద్రేమిటి సీతా! ఇలాగే ఎవరో ఒకరు వస్తూంటారు." అన్నాడు, కనురెప్పలు భారంగా మూస్తూను.

"నిద్రాహారాలు విసర్జించి ఇల్లా తిరుగుతూ నీ హెల్తుని ఎల్లా మెయిన్టయిన్ చేయగలవు చెప్పు!" అంది, లాలనగా.

"అంచేత నేనొకటి ఆలోచించాను. నిశ్చింతగా సర్వం నీచేతుల్లో పెట్టేసి హాయిగా వుందామనుకుంటున్నాను. నా కోరిక కాదంటావనుకోను." సోఫాలో ప్రక్కన కూర్చుని ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. సీత కాస్సేపు వూరుకుని చేయి తీసుకుంది. "వొద్దు శర్మా! నన్నిలా బ్రతకనీయి. ఇంత ఐశ్వర్యం నన్ను గాభరా పెట్టేసుంది."

"ఈ ఐశ్వర్యం శాశ్వతమా సీతా! రేపీపాటికి మామూలుమనిషి నయిపోనూ!"

"అలా అనకు. ఇన్నాళ్ళకు కన్పించానన్న మమకారం కొద్దీ అంటున్నావుకాని, ఇంత లక్జూరియస్ లైఫ్ని నాకోసం త్యజించానన్న అహంభావం నీలో బయలుదేరుతుంది. ప్రతిక్షణం నాకోసం ఇంత సంపదనీ త్యాగంచేస్తానన్న ధోరణి నువ్వు వ్యక్తపరుస్తూంటే నేను నిన్ను మామూలు భర్తలా గౌరవించలేకపోతాను. అది ఎంతవద్దనుకున్నా మన్నిలాంగదీస్తుంది. పోనీ ఇలా వుండగానే ఒప్పుకుందామంటే నీస్నేహాలు చూస్తూపడివుండడానికి నేనురాయిని కానుకదా! మన స్నేహం ఇంతతో చాలు నేను జీవితాంతం నిన్ను మరువలేను. నాకు మామూలు భర్త వచ్చి చావబాదుతున్నప్పుడు, "లక్షల కధికారి అయిన శర్మ అయితేనా!" అనుకునే సంతృప్తి నాకు చాలు! అన్నది, స్థిరంగా.

మన కలలు వమ్మేనా సీతా! అన్నాడు కవిత్వంగా.

"కవిత్వం మొదలెట్టకు. కలలు ఫలించటంలో కంటె ఫలిస్తాయేమోనన్న వూహాలోనే ఎక్కువ ఆనందం వుంది. మనం మామూలు మనుషుల్లా అయిపోయి ఒకరు నొకరు లక్ష అనుమానాలతో పీక్కుతినడంకంటే ఒకరి నొకరు ఆప్యాయంగా వూహించుకోడంలో ఎంత హాయివుందో నీకు అనుభవమవ్వాలని నా కోరిక" అన్నది సీత. శర్మ మౌనంగా చూస్తూండిపోయాడు.

సోమవారం ప్రొద్దుటే ఇంటిముందర ముగ్గుపెట్టుతూన్న సీత ఇంటావిడ, పెద్దకారులోంచి దిగుతున్న సీతనుచూసి ముక్కుమీద వేలేసుకుంది. శర్మ. "మరి వస్తా సీతా! గుడ్మార్నింగ్" అంటూ కారులోకి దూసుకుపోయాడు. సీత కలలోంచి తేరుకున్నదానిమల్లే వంటింట్లోకెళ్ళి పిల్లి బోర్లించిన వుప్పుపిండిగిన్నెనీ, చీమలుపట్టిన కాఫీ గిన్నెనీచూస్తూ నిల్చుండిపోయింది. తాను గడిపిన రోజుల తీరు నెమరుకు వస్తూంది సీతకు. ఇంటామె వచ్చి "ఎక్కడకు వెళ్ళావమ్మాయ్? మొన్నట్నించీ జాడలేదూ!" అని సాగదీసింది. గుండె చిక్కపట్టుకుని "మా చుట్టాలింటికి వెళ్లానండి. సెలవేకదాని" అనేసింది.

"కారులో అతగాడెవరూ?" కనుబొమ్మ లెగరేసింది.

"మా కజినండి" అనేసి వంటపనిలో నిమగ్నమయినట్టుగా నటించసాగింది సీత.

"సీతా! సీతా! అంటూ వాడెవడో మేనత్తకొడుకులా మాట్లాడేస్తూంటే కజినుట! కజిను! నా దగ్గరా దీని వేషాలూ!" అని గొణుక్కుంటూ లోపలికి వెళ్ళింది ఇంటావిడ!